**జరిగిన కథ :** ఒక చిన్న అపోహ కారణంగా భోజమహారాజు తన భార్యను, కాళిదాసును దూరం చేసుకున్నాడు. తప్పు తెలుసుకుని వారిని వెతుక్కుంటూ దేశాల వెంట తిరగసాగాడు. అదే సమయంలో కాశీలో చదువుకున్న ఏడుగురు మిత్రులు భోజరాజు వద్ద కొలువు సంపాదించడం కోసం ధారానగరానికి వస్తున్నారు. వారందరి మధ్య జరుగుతున్న విచిత్ర మజిలీలకే.. 'సప్తమిత్ర చరిత్ర' అని పేరు.






# యక్షుని గుహలో విచిత్రాలు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

భోజ కాళిదాసులు ధారానగరానికి బయల్దేరారు. భోజునికి తన భార్య ఇంకా దొరకలేదు. మరోపక్క ఆమెను చూపిస్తానని తనతో పాటు వచ్చిన ఘోటకముఖుడు ఏమయ్యాడో కూడా తెలియదు. భైరవుడు ఆరోజు భోజుణ్ని మేకగా మార్చిన తరువాత.. అంతకుముందు తన జన్మనంతా మరిచిపోయాడు. వాడు ఆడించినట్లల్లా ఆడాడు. ఏకశిలానగరంలో అల్లాణభూపతి వద్దనున్న కాళిదాసును కలుసుకోవడంతో.. భోజరాజుకు శాపవిమోచనం కలిగినట్లయింది. కాళిదాసును వెంటబెట్టుకుని ఆయన ధారానగరానికి వస్తున్నాడు.

అటువైపున ధారానగరంలో.. యక్షునివల్ల శాపం పొంది ఆడపిల్లగా మారిపోయిన దత్తకుడు, భోజరాజు కూతురైన రుక్మిణి వద్ద చారుమతి అనే పేరుతో సేవకురాలిగా ఏడాదికాలం గడిపాడు. ఆ సమయంలోనే భోజరాజు కుమారుడైన చిత్రసేనుడు ఆమెపై విపరీతమైన మోహం పెంచుకున్నాడు. శాపం తీరి మళ్లీ మగవాడిగా మారిన తరువాత, దత్తకుడు తన మిత్రుడైన గోణికాపుత్రునితోపాటు చిత్రసేనుడిని కలుసుకున్నాడు.

''ఎలాగైనా నీకు చారుమతిని దక్కిస్తాను'' అని బూటకపు ప్రతిజ్ఞ చేశాడు.

..కానీ ఒకసారి మగవాడిగా మారిపోయిన తరువాత, చారుమతి ఎక్కడుందని వెతకాలో చిత్రసేనుడికి ఎలా తెలుస్తుంది?

ఇలా ఉండగా.. ఒకసారి ధారానగరంలో ఒక అపూర్వగాయని ప్రదర్శన ఇస్తున్నదని తెలిసి.. మిత్రులిద్దరితో కలిసి చిత్రసేనుడు వెళ్లాడు. కానీ ఆ గాయని చారుమతి కాదని తెలిసి వెనక్కు వెళ్లిపోయాడు.

మిత్రులిద్దరూ ప్రదర్శన చివరివరకు చూశారు. ఆ గాయని పేరు సువర్ణపదిక. ఆమె మరెవరో కాదు.. దత్తుడు మొదలైనవారితో కలిసి కాశీలో చదువుకున్న సువర్ణనాభుడే. మిత్రులను కలుసుకున్న ఆనందంలో సువర్ణనాభుడు వాళ్లిద్దరినీ తన భార్యకు పరిచయం చేశాడు. ఆమె ఒక యక్షిణి అని, తన అక్కాబావలపై ప్రేమతో వారిని వెతుక్కుంటూ భూలోకానికి వచ్చిందని తెలియచేశాడు.

అప్పుడు దత్తకుడు.. 'మీ అక్కాబావలు ఉండే చోటు నాకు తెలుసు' అంటూ, అంతకుముందు తాను చూసిన యక్షుని గుహను వర్ణించి చెప్పాడు. అక్కడికి వెళ్లడానికి కొన్ని గుర్తులు చెప్పాడు.

అంతే.. మళ్లీ ఆడపిల్లగా మారిపోయాడు. 'మేముండే తావును ఎవరికి చెప్పినా మళ్లీ ఆడపిల్లవై పోతావు' అంటూ, ఆనాడు యక్షుడు చెప్పిన మాట ఆ క్షణంలో దత్తకుడు మరిచిపోయాడు.

మళ్లీ గతమంతా మరిచిపోయి, ఆడపిల్లగా మారి యథాలాపంగా రుక్మిణి ఉద్యానానికి వెళ్లాడు. అక్కడ చిత్రసేనుడు కనిపించాడు. అతను తన చిరకాలవాంఛను చారుమతి ముందు వెళ్లబోసుకున్నాడు. తాను నిజానికి ఒక మగవాడినని అన్న నిజం మరిచిపోయి.. చిత్రసేనుడితో వలపులో పడింది చారుమతి.

ఆనాటి రాత్రి..

సువర్ణపదిక తన మనసులో మాట భర్తకు చెప్పింది.

''నాథా! నేను మా అక్కాబావలను చూసి మూడేళ్లు దాటుతున్నది. మీ మిత్రుడు దారి చెప్పాడు కదా.. మన మిద్దరం వెళ్లివద్దాం'' అన్నది.

''నిజమే! కానీ మా దత్తకుడు కూడా వెంటవస్తే బాగుండేది'' అన్నాడు సువర్ణనాభుడు.

''మరేం పరవాలేదు. వెళ్లే దారి చెప్పాడు కదా! పొద్దున్నే మనం ఉత్తమాశ్వాలను అధిరోహించి వెళ్తే సాయంత్రానికి అక్కడికి చేరుకోగలం'' అని సలహా ఇచ్చింది సువర్ణపదిక.

వారనుకున్నట్లే మరునాడు దత్తకుడు చెప్పిన గుర్తుల ప్రకారం అడవిలో ప్రయాణించారు. కొంతదూరం గుట్టల్లో, రాళ్లలో ప్రయాణించిన తరువాత చిట్టచివరికి యక్షుని గుహకు చేరుకున్నారు. సువర్ణపదిక గుహ ద్వారం ఎదుట నిలబడి.. 'అక్కా!' అని యక్షభాషలో పిలిచింది. మరునిమిషంలో లోపలినుంచి రత్నపదిక పరుగున వచ్చింది. చెల్లెలిని కౌగిలించుకుంది. భర్తతోపాటుగా ఆమెను లోపలికి తీసుకుపోయింది.

సువర్ణనాభుడు గుహలోని విశేషాలు చూడటంలో మునిగిపోయాడు.

''ఇక్కడికి ఎలా రాగలిగావే?'' అడిగింది రత్నపదిక.

''అక్కా! నువ్వు, బావ లేని కుబేరుని కొలువులో నేను ఉండలేకపోయాను. అందుకే భూలోకానికి వచ్చేశాను. ఇతణ్ని వరించాను. ఇతని స్నేహితుడైన దత్తకుడు అనేవాడు ఈ గుహ గుర్తులు చెప్పాడు. దాంతో ఎలాగో రాగలిగాను. ఇంతకీ బావ ఎక్కడున్నాడు?'' అని ప్రశ్నించింది సువర్ణపదిక.

''కాసేపట్లో వచ్చేస్తారులే! మీరిద్దరూ కొంచెం సేపు విశ్రాంతి తీసుకోండి'' అంటూ రత్నపదిక లోపలి గది